రూ. 40లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

16, 48 డివిజన్లలో రూ.40 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. నగరంలోని 16, 48 డివిజన్ల పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో గుర్తించిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.40 లక్షల వ్యయంతో రహదారులు, కాలువల నిర్మాణం చేపట్టి మారుమూల ప్రాంతాలకూ అభివృద్ధి ఫలాలు అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమాల్లో జోనల్ ఇన్చార్జి ఆశపు వేణు, కార్పొరేటర్లు గుజ్జల నారాయణరావు, నడిపిల్లి ఆదినారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేస్తున్న కోలగట్ల

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సిపిఎం బైక్ యాత్ర

- నేటి సాయంత్రానికి విజయనగరానికి చేరనున్న యాత్ర
- వై-జంక్షన్‌లో స్వాగత సన్నాహాలు
- బాలాజీ జంక్షన్‌లో బహిరంగ సభ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను గుత్తపెట్టుబడిదారీ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఉత్తరాంధ్రలో మోటార్ సైకిల్ యాత్ర చేపట్టింది. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బుధవారం బైక్‌జాత ప్రారంభం కానుంది. సాయంత్రం 5గంటలకు విజయనగరం జిల్లా కేంద్రానికి చేరనుంది. 6గంటలకు బాలాజీ జంక్షన్‌లో బహిరంగ సభ నిర్వహించ నున్నారు. రాత్రికి నగరంలోని బసచేస్తారు. జాతాలో కేంద్రాన్ని ప్రశ్నించని అధికార, ప్రతిపక్ష పార్టీల రాజకీయ బండారాన్ని సిపిఎం నాయకులు బయట పెట్టనున్నారు.

విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో ఏర్పడిన విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జిల్లాకు చెందిన వేలాది మంది పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. ఏటా రూ.వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వానికి సమకూరుస్తోంది. సిఎస్ఆర్ నిధుల ద్వారా ఎన్నో గ్రామాలు, పట్టణాల్లో పలు ప్రాంతాల అభివృద్ధికి పరోక్షంగా దోహదపడుతోంది. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించింది. వీరి అవసరాలు తీర్చే ట్రాన్స్‌పోర్టు, కూరగాయాలు, టీ, టిఫిన్ వంటి దుకాణాలతో పాటు ఎన్నో వ్యాపారాలు చేస్తూ గాజువాక, కూర్మన్నపాలెం ప్రాంతాల్లో బతుకీడుస్తున్నవారూ వేలాది మంది ఉన్నారు. ఇటువంటి బంగారుబాతు గుడ్డు లాంటి స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వం నష్టాల పేరుతో ప్రైవేటు సంస్థకు అమ్మేస్తుందన్న వార్త విస్మయానికి గురిచేస్తోంది. ప్లాంట్ ప్రైవేటీపరమైతే ఉద్యోగాలు తగ్గిపోతాయి. ఉద్యోగుల, కాంట్రాక్టు కార్మికుల ఉపాధి భద్రత ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు సుమారు ఏడాది క్రితం నుంచి నిరవధికంగా ఆందోళనలు చేస్తున్న విషయం విధితమే. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమంగా మారింది. ఈ నేపథ్యంలో దిశమార్చుకున్న కేంద్ర ప్రభుత్వం ప్లాంటును ముక్కలుగా విభజించి ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోంది. ఇంత జరుగుతున్నా రాష్ట్రంలో అధికారంలో వున్న వైసిపిగానీ, ప్రతిపక్ష టిడిపిగానీ, కేంద్రం వద్ద తనకు ఎంతో పలుకుబడి ఉన్నట్టుగా చెప్పుకుంటున్న జనసేన గాని కేంద్ర ప్రభుత్వాన్ని బహిరంగంగా ప్రశ్నించడం లేదు. ఈ మూడు పార్టీలూ లోలోపల లాలూచీ పడడంతోనే కేంద్రం వెనక్కి తగ్గడం లేదు. ఇటువంటి తరుణంలో మన జిల్లాలోని ప్రతి పల్లె తల్లడిల్లుతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై సుమారు 2లక్షలకుపైగా జీవనం సాగిస్తుండగా, అందులో మన జిల్లాకు చెందినవారు తక్కువలో తక్కువగా 20వేల మంది ఉంటారని అంచనా. ఒక్క కాంట్రాక్టు కార్మికులే సుమారు 5వేల మంది ఉంటారు. పర్మినెంట్ ఉద్యోగులు మరో రెండువేల మంది వరకు ఉండవచ్చు. మొత్తం స్టీల్‌ప్లాంట్ ఆధారంగా గాజువాక ప్రాంతంలో జీవిస్తున్న లక్షలాది మందికి పాలు, కూరగాయాలు, టీ, టిఫిన్, హోటల్స్, ఆటోలు, కార్లు నడుపుతూ వేలాది కుటుంబాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో బైకు యాత్ర ఒక్క విశాఖపట్నానికి పరిమితం కాకుండా శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనకాపల్లి, పాడేరు జిల్లాల్లో కూడా సాగనుంది.

బైక్‌యాత్ర సాగుతుందిలా..

విజయనగరం జిల్లా కేంద్రానికి బుధవారం సాయంత్రం 5గంటలకు బైక్ ర్యాలీ చేరుకుంటుంది. విటి అగ్రహారంలోని వై.జంక్షన్ వద్ద బైక్‌యాత్రకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వాగతం పలికి, ర్యాలీలో భాగస్వామ్యం కానున్నారు. అక్కడి నుంచి బాలాజీ 'అంబేద్కర్) జంక్షన్‌కు చేరుకుంటుంది. అనంతరం అక్కడ బహిరంగ సభ జరుగుతుంది. బైక్‌యాత్ర చేపట్టిన నాయకులు రాత్రికి విజయనగరంలోనే బస చేస్తారు. గురువారం ఉదయం 10గంటలకు నెల్లిమర్ల, 11గంటలకు చీపురుపల్లి, 1 :30 గంటలకు రాజాం చేరుతుంది. సాయంత్రం 4:30గంటలకు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చేరనుంది. తిరిగి 24న పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గ కేంద్రానికి ఉదయం 10గంటలకు చేరుకోనుంది. అదే రోజు 12గంటలకు పార్వతీపురం, 3:30గంటలకు సాలూరు చేరుతుంది. సాయంత్రం 5:30గంటలకు బొబ్బిలి పట్టణానికి చేరుకుంటుంది. బహిరంగ సభ అనంతరం రాత్రికి అక్కడే బస చేయనున్నారు. 25న ఉదయం 10గంటలకు గజపతినగరం చేరుకుంటుంది. అక్కడి నుంచి ఎస్.కోట మీదుగా పాడేరు జిల్లాలోకి ప్రవేశిస్తుంది.

బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

విజయనగరం టౌన్ : విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం నుంచి చేపట్టనున్న ఉత్తరాంధ్ర బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు కోరారు. విశాఖలో ప్రారంభం కానున్న సందర్భంగా గోడపత్రికలను మంగళవారం కోట వద్ద, గురజాడ నగర్‌లో సిపిఎం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ 32మంది ప్రాణ త్యాగాలు, వీరోచిత పోరాటంతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రంలోని బిజెపి కుట్ర పన్నుతుందని అన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఐదు వేల పోస్టులను భర్తీ చేయాలని, పరిశ్రమ నిర్వహణకు రూ.5వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1000 రోజులుగా స్టీలుప్లాంట్ కార్మికులు, అన్ని కార్మిక సంఘాలూ ఐక్యంగా పోరాడుతున్నాయని అన్నారు. వారి పోరాటం విజయవంతం అయ్యేందుకు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపే వరకు కార్మికులకు అండగా సిపిఎం ఉంటుందని అన్నారు. ఈనేపథ్యంలో వై జంక్షన్ వద్ద బైక్ ర్యాలీకి స్వాగతం పలికి అనంతరం అంబేద్కర్ విగ్రహం జంక్షన్‌కు చేరుకుని సభ నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలంతా బైక్‌ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, ఎ.జగన్మోహన్, బి.రమణ, కంది త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

అంబులెన్సులో రోగులను జిల్లా కేంద్రాస్పత్రికి తరలిస్తున్న వైద్యసిబ్బంది; పినతాడివాడలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

పినతాడివాడ, గుణుపూరుపేటలో

విజృంభించిన డయేరియా

- 70 మందికి అస్వస్థత
- స్పందించిన వైద్యసిబ్బంది
- గ్రామాల్లో వైద్య శిబిరాలు
- పరిశీలించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పినతాడివాడ, గుణుపూరుపేట గ్రామాల్లో డయేరియా విజృంభించింది. ఈ రెండు గ్రామాల్లోను గత రెండు రోజులుగా సుమారు 70 మంది వరకు వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురయ్యారు. ఈనేపథ్యంలో స్థానిక పిహెచ్‌సికి సుమారు 70 మంది వరకు డయేరియా రోగులు తరలివచ్చారు. వీరిలో పిన తాడివాడ గ్రామానికి చెందిన వారే సుమారుగా 60 మంది వరకు ఉన్నారు. పరిస్థితి విషమించిన సుమారు 20మందిరోగులను మెరుగైన వైద్యంకోసం జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. మరో 20 మంది విజయనగరంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేసిన వారిలో మీసాల దుర్గమ్మ, సుమా, ఆవాల రాజు, రిషిత, వాల్లె అప్పయ్యమ్మ, వాల్లె తౌడు, మజ్జి కొండమ్మ, మీసాల వాసు, కె.అప్పల రాజు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే స్పందించిన వైద్యాధికారి ఎం.పావని ఆధ్వర్యాన సిబ్బంది ఈ రెండు గ్రామాల్లోను వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇంటింటికీ వైద్య సిబ్బందిని పంపించి డయేరియా రోగులను గుర్తించి వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. బుధవారానికి డయేరియా అదుపులోనికి వచ్చింది. పిన తాడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావు, కార్యదర్శి జగదీష్ ఆధ్వర్యాన గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. పరిసరాలను శుభ్రపరిచి బ్లీచింగ్ చేయించారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించారు. తాగునీరు కలుషితం కావడం వల్లే డయేరియా ప్రబలిందని గ్రామస్తులు అంటున్నారు. ఈనేపథంలో తాగునీటిని పరీక్షకు పంపించారు. డయేరియాతో ఎక్కువ మంది అస్వస్థతకు గురవ్వడంతో రెండు గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ముఖ్యంగా పినతాడివాడ ఒక్కసారిగా 60 మందికి వాంతులు, విరేచనాలు కావడంతో ప్రజలు ఆందోళన చెందారు. మొత్తం మీద వైద్య సిబ్బంది డయేరియాను అదుపులోనికి తీసుకురావడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గుణుపూరు, పినతాడివాడ గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాలను జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు సందర్శించారు. డయేరియా రావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రజలు డయేరియా బారిన పడకుండా నివారించాలని చెప్పారు. వైద్య శిబిరాలను కొనసాగించాలని ఆదేశించారు. ఆయనతో పాటు డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యనారాయణ డిఐఒ అచ్యుతకుమారి, డిఎంఒ మనీ తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలందిస్తున్న డాక్టర్

21న 'సీతం'లో జిల్లా స్థాయి యువజనోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా స్థాయి యువజనోత్సవాలు ఈనెల 21న సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతాయని సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్ తెలిపారు. మంగళవారం ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సీతం కళాశాలలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ యువజనోత్సవాల ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యాలు , పర్యావరణ పరిరక్షణ, సైన్సు అండ్ టెక్నాలజీ, ఫుడ్ ఫెస్టివల్ తదితర పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 15-29 ఏళ్ల మధ్య వయసున్న యువతీయువకులు పాల్గొనవచ్చునని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు రాష్ట్రస్థాయిలోను, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు జాతీయస్థాయి యువజనోత్సవాలలో పాల్గొంటారని తెలిపారు. పాల్గొన దలచినవారు (7981444647) (8309661801) ఫోన్ నంబర్లను ఈనెల 20లోగా సంప్రదించాలని తెలిపారు.

కొనసాగుతున్న టిడిపి నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

చంద్రబాబు ఎటువంటి నేర ఆరోపణ లేకుండా బయటకు రావాలని కోరూతూ విజయనగరంలోని పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద టిడిపి నాయకులు మంగళవారం పూజలు చేశారు. తొలుత కోట వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన టిడిపి నాయకులు అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల నియోజకవర్గాల అధ్యక్షులు కిమిడి నాగార్జున, గుమ్మడి సంధ్యారాణి, నాయకులు కోళ్ల లలిత కుమారి, డాక్టర్ కొండపల్లి అప్పలనాయుడు, కర్రోతు బంగారురాజు. బోనెల విజయచంద్ర, తోయక జగదీశ్వరి మాట్లాడారు. టిడిపిని దెబ్బ కొట్టాలనే ఉద్దేశంతోనే ఈ రకమైన అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసి జైల్లో పెట్టించారని అన్నారు. ఈ రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు అవసరం ఎంతయినా ఉందన్నారు. నేడు చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు వ్యతిరేకంగా ధర్నాలు చేస్తున్నారంటే అది ఆయన పరిపాలన విధానం దూరదృష్టే అందుకు నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నాయకులు ఆర్‌పి భంజ్‌దేవ్, ద్వారపురెడ్డి జగదీష్, మహంతి చిన్నం నాయుడు, కరణం శివరామకృష్ణ, అల్లాడ భాస్కరరావు, చింతల రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి గొంపకృష్ణ, విజయనగరం పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, ఉమ్మడి జిల్లాల నాయకులు అందరూ పాల్గొన్నారు.

కోట నుంచి పైడితల్లి అమ్మవారి ఆలయానికి ర్యాలీగా వెళ్తున్న టిడిపి నాయకులు

గ్రామ, వార్డు స్థాయిలో నిరసనలు

చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా విజయనగరం నియోజకవర్గం లోని అన్ని గ్రామాలు, వార్డుల్లోను ఒక్కరోజు నిరాహారదీక్షలు టిడిపి నాయకులు, కార్యకర్తలు చేపట్టారు. పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు సారిక, చెల్లూరు, రీమాపేట గ్రామాల్లోను, నగరంలోని 6, 7, 28, 29, 35 వార్డుల్లో తెలిపిన వారికి వెళ్లి సంఘీభావం తెలిపారు. విజయనగరం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున 29వ వార్డుకు వెళ్లి సంఘీభావం తెలిపారు. జనసేన నాయకులు గురాన అయ్యలు గారు 15, 47వ వార్డులలో సంఘీభావం తెలిపారు. ద్వారపూడిలో నిరసనలు చేస్తున్న వారికి బొద్దల నర్సింగరావు సంఘిభావం తెలిపారు చంద్రబాబు నాయుడు వెంటనే విడుదల చేయాలని కోరుతూ విటి అగ్రహారంలో మాజీ కౌన్సిలర్ రొంగలి రామారావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

గతం కంటే మిన్నగా పైడితల్లమ్మ పండగ

- రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ
- విజయనగరం ఉత్సవాల నిర్వహణకు ప్రతిపాదన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి పండగను అక్టోబరు 30,31 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. అమ్మవారి ఉత్సవాల నిర్వహణపై కలెక్టరేట్ ఆడిటోరియంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతం కంటే మిన్నగా ఉత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని, గతంలో చోటుచేసుకున్న చిన్నచిన్న లోపాలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. ఈ ఏడాది కూడా విజయనగరం ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈనెల 29న వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఆలయ కమిటీ ప్రతినిధులు, జీవితకాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి, వారందరి అభిప్రాయాలను తెలుసుకొని, ఉత్సవ నిర్వహణకు ఒక ప్రణాళికను తయారు చేయాలని మంత్రి ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణకు చుట్టు పక్కల జిల్లాలనుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాదిమంది భక్తులు తరలివస్తారని, వారందరినీ దృష్టిలో పెట్టుకొని తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ అమ్మవారి ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే ఆలయం తూర్పువైపు షాపులను తొలగించామని, ఉత్సవాలకు ముందే పశ్చిమవైపు కూడా తొలగిస్తామని చెప్పారు. గత ఏడాది సిరిమానోత్సవం కొద్దిగా ఆలస్యం అయ్యిందని, ఈ సారి అది జరగకుండా ముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిరిమానోత్సవం అనంతరం కోట వద్ద పులివేషాల పోటీ, రాజీవ్ స్టేడియంలో బాణాసంచా కాల్చడం జరుగుతుందని చెప్పారు. వీలైనంత వరకు సోమవారం నాటికే విఐపిల దర్శనాలు పూర్తి చేసుకుంటే, మంగళవారం నాడు ఇబ్బందులు ఉండవన్నారు. ఈ ఏడాది కూడా విఐపి పాస్‌లను రద్దు చేయాలని, సామాన్య భక్తులు దర్శనానికి ఇబ్బంది పడకుండా చూడాలని కోలగట్ల కోరారు.

జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విఐపిల దర్శనాల సమయంలో కూడా సామాన్య భక్తుల దర్శనాలు కొనసాగేలా చూడాలని కోరారు. సిరిమానును తీసుకువచ్చి, సిద్ధం చేసే ప్రక్రియలో అన్ని శాఖల మధ్యా సమన్వయం ఉండాలని, జాప్యం జరగకుండా చూడాలని సూచించారు. సమావేశం అనంతరం మంత్రి బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడి, ఉత్సవ ఏర్పాట్లను వివరించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక, ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీమేయర్ లయా యాదవ్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, పైడితల్లి అమ్మవారి ఆలయ ఇఒ సుధారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖా మంత్రి బొత్ససత్యనారాయణ

లక్ష్యాలను చేరకపోతే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

చెప్పిన పని చెప్పినట్లు చేయకపోయినా.. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకొకపోయినా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మున్సిపల్, మండల స్థాయి అధికారులను హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి మంగళవారం జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ప్రత్యేక అధికారులతో కలిసి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే, ఇళ్ల నిర్మాణాలు, ప్రభుత్వ భవన నిర్మాణాలు ఇతర పనుల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను మరింత వేగవంతం చేయాలని, ప్రతి కుటుంబం నుంచి సేకరించిన వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతంలో 20 రోజుల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 15 రోజుల్లోగా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని చెప్పారు. భవిష్యత్తులో ఇవే వివరాల ఆధారంగా వైద్య చికిత్సలు ఉంటాయి కాబట్టి సర్వే విషయంలో అందరూ సీరియస్‌గా వ్యవహరించాలని పేర్కొన్నారు. రోజూ 40 కుటుంబాల వివరాలను సేకరించాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య శ్రీ యాప్ డౌన్ లోడ్ చేసుకొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఫినిషింగ్ దశలో ఉన్న భవనాలను సెప్టెంబర్ ఆఖరు నాటికి పూర్తి చేసేయాలని సూచించారు. జగనన్న కాలనీల్లో చేపట్టిన నిర్మాణాల పూర్తికి సమిష్టి కృషి చేయాలన్నారు. డిసెంబర్ నాటికి ఎట్టిపరిస్థితుల్లో శతశాతం నిర్మాణాలు పూర్తి కావాల్సిందే అని పేర్కొన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా నమోదవుతున్న ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించాలని ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

వంగర ఎంపిడిఒపై సీరియస్

ముందస్తు సమాచారం ఇవ్వకుండా సెలవుపై వెళ్లిన వంగర మండల ఎంపిడిఒపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. విసిలో భాగంగా ఆయనను పిలవగానే రెస్పాండ్ కాలేదు. ఇఒపిఆర్‌డి రెస్పాండ్ అయ్యి సెలవు పెట్టారని చెప్పగా... ఎవరికి చెప్పి సెలవు పెట్టారని ఘాటుగా స్పందించారు. వెంటనే వచ్చి జెడ్‌పిసిఇఒను, తనను కలవాలని ఆదేశించారు.సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్లు దొర, వెంకటేశ్వర రావు, పద్మలత, ప్రత్యేక అధికారులు, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చిన్నారిని ఆదుకున్న బొత్స కుటుంబం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తలసేమియా వ్యాధితో బాధ పడుతున్న రెండున్నరేళ్ల బాలుడి వైద్య ఖర్చులకు మంజూరైన రూ.14 లక్షల చెక్కును రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం తన నివాసంలో బాధిత కుటుంబానికి అందజేశారు. చీపురుపల్లి నియోజకవర్గం ముల్లుపేటకు చెందిన రెండున్నరేళ్ల ముళ్ళు భువనసాయి తలసేమియాతో బాధ పడుతున్నాడు. ఈ ఏడాది మే 10న భువన సాయి తల్లి దండ్రులు మాజీ ఎంపి బొత్స ఝాన్సీ లక్ష్మిని కలసి తమ బాధను వివరించారు. లక్షల రూపాయలతో కూడిన వైద్యాన్ని తాము చేయించుకోలేమని, ఆదుకోవాలని కోరారు. స్పందించిన ఝాన్సీలక్ష్మి డాక్టర్ సందీప్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో డాక్టర్ సందీప్ ఆ చిన్నారి వైద్యం చేయించుకుంటున్న శ్రీకాకుళం ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి అక్కడి నుంచి హైదరాబాద్ అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్‌కు భువన సాయిని పంపించారు. వారి ప్రత్తిపాదనల మేరకు సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ సిఫారసు చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి భువనసాయి వైద్యానికి అయ్యే రూ.14 లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నట్టు వచ్చిన పత్రాలను మంత్రితో పాటు ఝాన్సీలక్ష్మి, డాక్టర్ సందీప్ అందజేశారు. కార్యక్రమంలో చీపురుపల్లి మండల నాయకులు ఇప్పిలి అనంత్, వలిరెడ్డి శ్రీనివాసరావు, మెట్టపల్లి ఎంపిటిసి ఈశ్వరరావు పాల్గొన్నారు.

భూములు లాక్కొని రోడ్డున పడేయకండి

ప్రజాశక్తి- బొబ్బిలి

జీవనోపాధి కల్పిస్తున్న భూములను లాక్కుని తమ బతుకులను రోడ్డు పాలు చేయవద్దని గొర్రెల కాపర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దత్తిరాజేరు మండలం చినచామాలపల్లి గ్రామంలో 50 ఎకరాల భూమి సేకరణను విరమించుకోవాలని కోరుతూ మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద గొర్రెల కాపర్లు మంగళవారం ధర్నా చేశారు. గ్రామానికి ఆనుకుని ఉన్న భూములను కొంతమంది బడా వ్యాపారులు కొనుగోలు చేయడంతో ఆయా భూములు చుట్టూ కంచె ఏర్పాటు చేయడం వల్ల గొర్రెలను మేతకు తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామానికి ఆనుకుని ఉన్న భూములను తీసుకుంటే గొర్రెలను మేతకు తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ 150 కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న భూములను తీసుకుని కృషి భవన్‌కు ఇవ్వడం అన్యాయమన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. తక్షణమే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఎఒ గణపతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఎం.ఎరుకునాయుడు, సర్పంచ్ మజ్జి భారతి, జిల్లా కమిటీ సభ్యులు జి. శ్రీనివాసరావు, వైసిపి నాయకులు మజ్జి శ్రీనివాసరావు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గొర్రెలు కాపర్లు

నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

సమస్యలు పరిష్కరించండి : ఎస్ఎఫ్ఐ

గజపతినగరం: మండలంలోని మరుపల్లి మోడల్ స్కూల్లో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారని తక్షణమే సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థులతో ఆందోళన చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి డి రాము మాట్లాడుతూ మోడల్ స్కూల్లో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. గత రెండు వారాలుగా రెండు తరగతుల్లో కరెంటు సదుపాయం లేదని తరగతి గదికి పక్కనే అబ్బాయిల మరుగు దొడ్లు వాటి నుండి దుర్వాసన రావడంతో చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నారని అన్నారు. విద్యార్థుల దగ్గర నుండి ఆట వస్తువుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. స్కూల్లో వంటగది లేకపోవడం వల్ల చెట్టు కింద వంట చేయడంతో చెట్టుపైన ఉన్న పురుగులు, రాళ్ల ఆహారంలో చేరి విద్యార్థులు తినలేక పోతున్నారన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కారించాలని లేని పక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ఎన్ తాతినాయుడు, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ ఇళ్లు

బొబ్బిలిరూరల్ : ఇల్లు లేని నిరు పేదలందరికీ ఇల్లు మంజూరు చేయడమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ వద్ద ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలు ఉండకూడదనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ 32 లక్షల ఇల్లు మంజూరు చేశారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డోల రాజేశ్వరరావు, ఉప తహశీల్దార్ గౌరీశంకర్, నాయకులు గుణుపురు శ్రీనివాసరావు, యడ్ల అప్పారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృత్తితో పాటు సామాజిక సేవలో ముందుండాలి

ప్రతి ఉద్యోగి తమ వృత్తితో పాటు సామాజిక సేవలో ముందుండాలని ఎమ్మెల్యే అప్పలనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఏర్పాటు చేసిన మెర్సీ గోడ (దయగల గోడ) వద్ద పేదలకు ఎమ్మెల్యే చేతులు మీదుగా బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ జేసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

బొబ్బిలి : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని, వారి డిపాజిట్లను వీలైనంత త్వరగా చెల్లింపులు చేపట్టాలని ఎమ్మెల్యే శంబంగి చిన అప్పలనాయుడుకు బొబ్బిలి బ్రాంచి పరిధిలో గల అగ్రిగోల్డ్ బాధితులు మంగళవారం వినతిపత్రాన్ని అందచేశారు. స్థానిక ప్రజాప్రతినిధిగా ముఖ్యమంత్రితో యుద్ద ప్రాతిపదికన తమ డిపాజిట్ సొమ్ము ఇప్పించి న్యాయం చేకూర్చమని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోగా విస్పష్టమైన ప్రకటన చేసి, అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకొనునట్లు కేటాయింపులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలా ఈశ్వర నారాయణ, పెద్దింటి రమేష్, కె. రాము, గంట అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఇంటింటి కుళాయి పనులు

వేపాడ: మండలంలోని సింగరాయ గ్రామంలో ప్రతి ఇంటికి తాగునీరు అందించే పనులను ఎస్సి కాలనీలో చురుగ్గా సాగుతున్నాయి. ఈ తాగునీటి పథకానికి రూ.40 లక్షల మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి తెలిపారు. ఈ పనులు పూర్తయితే ప్రతీ ఇంటికి తాగునీరు అందిస్తామని చెప్పారు.

పశు వైద్య కేంద్రం తనిఖీ

వంగర: స్థానిక పశువైద్య కేంద్రాన్ని సంతకవిటి అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడి) సిహెచ్ తిరుపతిరావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ మేరకు పశు వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశు వైద్య సేవలు అందించాలన్నారు. మండలం లోని శ్రీహరిపురంలో పశువైద్య శిబిరం నిర్వహించాలన్నారు. ఏ గ్రామం నుంచైనా ఫిర్యాదులు ఏమైనా వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎల్ఎస్ఎ గోపాల్ పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

50వ డివిజన్‌లో గడప గడపకు..

విజయనగరం టౌన్: నగరంలో 50వ డివిజన్ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందించారు. స్థానిక సమస్యలపైనా అడిగి తెలుసుకున్నారు. కాలువల సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు చెప్పడంతో సమస్యను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరలో కాలువల ఏర్పాటుకు చొరవ చూపుతామని అన్నారు. .

చట్టసభల్లో అవకాశం కల్పించాలి

విజయనగరం కోట: మైనార్టీ మహిళలకు చట్టసభల్లో 33శాతంలో 4శాతం అవకాశం కల్పించాలని వక్ఫ్ బోర్డ్ జిల్లా మాజీ అధ్యక్షులు ఎ.ఖరీమ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న మహిళలకు చట్టసభలలో అవకాశం కల్పిస్తే వారి అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. రిజర్వేషన్ల వల్ల మహిళలకు విద్య ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా వస్తాయని ఆశిస్తున్నామన్నారు.

అలరించిన నాదస్వరం

విజయనగరం కోట : మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల విద్యార్థులు నాదస్వరం అలరించింది. స్థానిక మహారాజ ప్రభుత్వ సంగీత కళాశాల వద్ద వినాయక నవరాత్రి మహోత్సవాలు కళాశాల ప్రిన్సిపల్ కెవివిఎల్ఎన్ శాస్త్రి ప్రారంభించారు.

రోడ్డుకు అడ్డుగా పడిన భారీ వృక్షం

కూలిన భారీ వృక్షం.. తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధి జరజాపు పేటలో భారీ వృక్షం కూలీ మూడు పూరిల్లు ధ్వంశమయ్యాయి. మంగళవారం17వ వార్డు పరిధి నెల్లిమర్ల - జరజాపుపేట రహదారి రాజా బంగారమ్మ గుడి వద్ద భారీ మర్రి చెట్టు ఉదయం కూలీ పోయింది. చెట్టు ఒక్కసారిగా పక్కనే ఉన్న కడియం సంతోషి, కడియం కుమారి, తమ్మిన్ని లక్ష్మీ రేకుల ఇళ్లపై పడిపోవడంతో ఆ ఇళ్లు ధ్వంశమయ్యాయి. అయితే చెట్టు కూలిన సమయంలో అందరూ బయట ఉండడంతో ప్రాణాపాయం తప్పింది. కాగా చెట్టు కూలీ పోవడంతో ట్రాఫిక్ అంతరాయం కలగడంతో స్థానికులు, నాయకులు స్పందించి ట్రాఫిక్ పునరుద్ధరణ జరిపారు.

బాధితులకు ఎమ్మెల్సీ పరామర్శ

చెట్టు కూలిన బాధితులను ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేశ్ బాబు పరామర్శించి ఆర్థిక సాయమందించారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాయకులు పాండ్రింకి సత్యనారాయణ, తుమ్ము నారాయణ మూర్తి, మద్దిల వాసు పాల్గొన్నారు.

అధికారులపై సభ్యులు ధ్వజం

ప్రజాశక్తి- రేగిడి

మనబడి, నాడు- నేడు రెండవ విడత పనుల బిల్లు చెల్లింపులలో జాప్యంపై సమగ్ర శిక్షా జెఇ దాలయ్య, వ్యవసాయ అధికారి మురళీకృష్ణపై సభ్యులు ధ్వజమెత్తారు. బుధవారం ఎంపిపి ధార అప్పలనరసమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నాడు, నేడులో అంబాడ వెంకటాపురం ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నిర్మించామని నేటి వరకు బిల్లులు కాలేదని సర్పంచ్ చుక్కా వెంకట నాయుడు సభ దృష్టికి తెచ్చారు. దీంతో జెఇ మాట్లాడుతూ గతంలో పనిచేసిన బిల్లులు చెల్లించాలని అన్నారు. దీనిపై వైస్ ఎంపిపిలు అచ్చెం నాయుడు, జగన్మోహన్‌రావు కలుగజేసుకొని కూర్చొని బిల్లు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ సమీక్షలో ఎఒ మురళీకృష్ణ మాట్లాడుతుండగా సభ్యులు అడ్డు తగిలి రెండో విడతలో ఎరువులు రాకపోవడంతో పంటలు తెగుళ్ల బారిన పడుతున్నాయని అందుకు ఎరువులు తెప్పించి పంపిణీ చేయాలని కోరారు. ఎరువులు పూర్తిస్థాయిలో రాలేదని సమీక్షలో ఏవో వెల్లడించారు. కందిస గ్రామానికి ఎరువులు పూర్తిగా రైతు భరోసా కేంద్రం నుంచి ఎంతవరకు

అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

అందజేయలేదని ఎంపిటిసి కెల్ల మన్మధరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎరువులు లేవని ఎమ్మెల్యే చొరవ తీసుకొని ఎడితో మాట్లాడితే ఎరువులు తెప్పించాలని కోరారు. రైతు భరోసా కేంద్రంలో పనిచేస్తున్న వ్యవసాయ అసిస్టెంట్లు పూర్తిస్థాయిలో పనిచేయడం లేదని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. సచివాలయ ఉద్యోగులు ఎవరి ఇష్టానుసారం వారు ప్రవర్తిస్తున్నారని క్రమశిక్షణలో లేరని సెలవులు ఎంపిడిఒకు తెలియకుండా పెట్టేస్తున్నారని అన్నారు. కనీస ప్రజాప్రతినిధులకు గౌరవం లేకుండా చూస్తున్నారన్నారు. డిడిఒ అనుమతి లేనిదే సెలవులు ఇవ్వరాదని వైస్ ఎంపిపిలు వెల్లడించారు.

పశువైద్య శాఖ సమీక్షలో మండల విప్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పశువులకు పలు రకాల వ్యాధులు సోకుతున్నాయని పశువైద్యాధికారులు పట్టించుకోలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. సంకిలి గ్రామంలో పశువైద్య కేంద్రానికి వైద్యులతో పాటు సిబ్బంది పూర్తిస్థాయిలో లేక మూగజీవాలు ఇబ్బందులు పడుతున్నాయని వెల్లడించారు. నాగేశ్వరావు ఐసిడిఎస్, ఆర్‌డబ్ల్యుఎస్, వెలుగు, మత్స్యశాఖ, ఇరిగేషన్, విద్య, వైద్యం, ఇరిగేషన్ పలు శాఖల పనితీరుపై నామ మాత్రమే సమీక్ష జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరయ్యారు. పలు శాఖల అధికారులు గ్రామస్థాయి ప్రజాప్రతినితో మమేకమై గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్యామల కుమారి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీ చరణ్, ఎంఇఒ ఎం. వరప్రసాదరావు, మండల నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

మానవత్వమే మహోన్నతం

బొబ్బిలి: మానవత్వం కలిగి అవసరంలో ఉన్న వారికి సాయమం దించటమే మహోన్నతమైందని రోటరీ క్లబ్ అధ్యక్షులు, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు అన్నారు. మానవత్వపు దినోత్సవ నేపథ్యంలో నాయుడు వలస గ్రామంలో ఏ ఆధారం లేక పోషణ, బట్టలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న పోలీస్ అనే వ్యక్తికి, బొబ్బిలి రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేస్తున్న వికలాంగ వ్యక్తికి బట్టలు, ఆర్థిక సాయాన్ని అందించారు. మానవత్వంతో చేసే చిన్న సాయం ఎంతో ఊరటను ఇస్తుందన్నారు.

గురజాడ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'సుపథ' స్వచ్ఛంద సేవ సంఘం ఆధ్వర్యాన ఈనెల 17న విజ్ఞాన భారతి పాఠశాలలో నిర్వహించిన 'సుపథ" జిల్లా స్థాయి పోటీ పరీక్షలో గురజాడ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు బహుమతులు సాధించారు. ప్రతిభ కనబర్చిన జిఎస్‌జి కృష్ణశంకర్, ఆర్.జాహ్నవి, ఎస్.జాహ్నవి, ఎస్.ఆశాభవాని, సిహెచ్‌రాధిక, ఎల్.వాత్సల్య, కె.మోదిని, ఎస్.లాస్య ను పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్ అభినందించారు.

ఘనంగా ఎమ్మెల్యే బడ్డుకొండ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - డెంకాడ

ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు జన్మదిన వేడుకలు మండలంలో తన స్వగ్రామం మోపాడులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బడ్డుకొండకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజాశక్తి దినపత్రిక వేసిన ప్రత్యేక సంచికను నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం వైసిపి నాయకులు, నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, వైస్ ఎంపిపిలు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు, వివిధ చైర్మన్లు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు,

ఎమ్మెల్యే బడ్డుకొండకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు, అధికారులు

కార్యకర్తలు సర్పంచులు, ఎంపిటిసిలు శుభాకాంక్షలు తెలుపారు. ప్రతి మండలం నుంచి వైసిపి ఆధ్వర్యంలో కేకులను తీసుకువచ్చి ఎమ్మెల్యే బడ్డుకొండతో కట్ చేయించారు. నాలుగు మండలాల్లో ఉన్న ఎంపిడిఒలు, తహశీల్దార్లందరూ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

పుట్టిన రోజు వేడుకల్లో జేబు దొంగతనాలు

ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకల్లో జేబుదొంగతనాలు జరిగాయి. వేల రూపాయలు నగదు, ఐదు సెల్ ఫోన్లు తస్కరించారు. ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గంలో నాలుగు మండలాలు నాయకులు, కార్యకర్తలు అధికారులు అధికంగా రావడంతో రద్దీ ఏర్పడింది. దీంతో ఇదే అదునుగా భావించిన దొంగలు జనం మధ్యలోకి దూరి వారు శుభాకాంక్షలు తెలిపేందుకు వెళుతున్నట్టుగా నటించి నాయకుల, కార్యకర్తల జేబులో ఉన్న డబ్బులను, సెల్ఫోన్లను కొట్టేశారు. మండలంలోని గోవిందపురం మాజీ సర్పంచ్‌కు చెందిన రూ.50 వేలు నగదును దోచుకున్నారు. మరో నాయకుడికి చెందిన రూ.10 వేలు దొంగిలించారు. చివరకు విజయనగరానికి చెందిన ఒక వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పజెప్పారు.

వృద్ధులకు అల్పాహారం, విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

నెల్లిమర్ల: ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడి పుట్టినరోజు వేడుకలు పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గంటా యువసేన ఆధ్వర్యంలో వైసిపి జిల్లా కార్యదర్శి గంటా సత్యనారాయణ (సతీష్) కన్యకా పరమేశ్వరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. పండ్లు పంపిణీ

ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ప్రజాశక్తి సిబ్బంది

చేశారు. స్థానిక ఆదిత్య విద్యాలయంలో విద్యార్థులకు పరీక్ష సామాగ్రి కిట్లు అందజేశారు. చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. కేకు కట్ చేసి, వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, వైసిపి నేతలు రాయల సురేష్, ఇమ్మిడిశెట్టి సతీష్, కృష్ణ మోహన్, పొంతపల్లి పాపారావు, అప్పలరాజు, బూసురోతు శ్రీను, సింగ్ రవి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కుట్రతోనే చంద్రబాబు అరెస్టు

ప్రజాశక్తి- బొబ్బిలి

రాజకీయ కుట్రతోనే చంద్రబాబును అరెస్టు చేశారని మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా అన్నారు. మంగళవారం సామూహిక నిరాహారదీక్ష కొనసాగించారు. దీక్షలో ముస్లిం మైనారిటీ సంఘం నాయకులు పాల్గొని మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, ముస్లిం మైనారిటీ నాయకులు జాఫర్, నాయకులు, పాల్గొన్నారు. **బొండపల్లి:** టిడిపి మండల అధ్యక్షుడు కోరాడ కృష్ణ, మాజీ జెడ్‌పిటిసి బండారు బాలాజీ ఆధ్వర్యంలో మండల సముదా యం వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. అనంతరం సిఎంకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ బుద్ధరాజు నరసింహవర్మ, టిడిపి నియోజక వర్గ సీనియర్ నాయకులు పాకలపాటి గోపాలరాజు, వేమలి చైతన్య

నెల్లిమర్ల: నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

బాబు, రాపాక అచ్చంనాయుడు, తాళ్లపూడి రమణ, బూర్లే ఆదినారాయణ, లింగమూర్తి, బోదంకి రమణ, బొడ్డు ఉమామహేశ్వరరావు, వెన్ను రామునాయుడు, గేదెల మహేశ్వరరావు, డోకుల శ్రీను, పట్నాన శ్రీను, రాజి నాయుడు, సిడగం శ్రీను తదితరులు పాల్గొన్నారు. **నెల్లిమర్ల:** టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో నెల్లిమర్లలో మంగళవారం రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మహంతి చిన్నంనాయుడు, కంది చంద్రశేఖ రరావు, సువ్వాడ రవిశేఖర్, సువ్వాడ వనజాక్షి, గేదెల రాజారావు, పతివాడ అప్పలనారాయణ, పోతల రాజప్పన్న, ఆకిరి ప్రసాద్ రావు, కర్రోతు సత్యనారాయణ, బైరెడ్డి లీలావతి, చిల్ల పద్మ, చీకటి సుహాసిని పాల్గొన్నారు. **గరివిడి :** చీపురుపల్లిలో టిడిపి మహిళ నేతలు మంగళవారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జున చంద్రబాబుకు పోస్టు కార్డుల ద్వారా సందేశం పంపారు. చంద్రన్న యోగక్షేమాలు కోరు తూ ఉత్తరాన్ని రాజమండ్రి సెంట్రల్ జైలు చిరునామాకు పంపిం చారు. ఈ లేఖలో ఆయనకు తామంతా అండగా ఉంటామని, క్షేమంగా, ధైర్యంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా నేతలు రౌతు కాంతమ్మ, పిళ్ళా కృష్ణవేణి, మీసాల హైమావతి, ముల్లు రమాదేవి, దన్నాన సత్యవతి, వెంపడాపు అన్నపూర్ణ, అరతి సాహు, పాల్గొన్నారు **శృంగవరపుకోట:** పట్టణంలోని ఆకుల డిపో వద్ద టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, ధార గంగమ్మ ఫంక్షన్ హాలు వద్ద నియోజకవర్గ ఇంఛార్జి కోళ్ల లలిత కుమారి, నియోజకవర్గ టిడిపి నాయకులతో వేరువేరుగా రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ

ఎస్‌కోట: ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

ఆకుల డిపో నుంచి దేవీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. **విజయనగరం కోట:** చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. పోస్ట్‌కార్డు పై 'మేము సైతం బాబుతో' అంటూ మాజీ ఎమ్మెల్యే మీసాల గీత ఆధ్వర్యాన పలు కళాశాలల్లో ప్రచారం చేపట్టారు. అనంతరం శ్రీనివాస కాలేజీలో ఉన్న విద్యార్థులతో సంతకాల సేకరణ చేపట్టారు. 40వ డివిజన్‌లో రిలే నిరాహార దీక్ష శిబిరం వద్దకు చేరుకొని సాయంత్రం చెరకు రసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. మాజీ కౌన్సిలర్ కెల్ల సూరిబాబు, సుంకరి విజయలక్ష్మి, మాజీ మండల ప్రధాన కార్యదర్శి దాట్ల రవిరాజు, జిల్లా టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి మాడుగుల భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయిలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శృంగవరపుకోట

రూ. 65 లక్షల నిధులతో దారపర్తి పంచాయతీ పరిధిలోగల గిరి శిఖర గ్రామాలకు ఇంటింటకీ మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని దారపర్తి సచివాలయం పరిధిలోగల పల్లపు దుంగాడ గ్రామంలో గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కడుబడి శ్రీనివాసరావు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌కోట పట్టణానికి సుమారు 12 కిలోమీటర్ల దూరంలో గిరి శిఖరాన ఉన్న పల్లపు దుంగాడ గ్రామానికి సుమారు 30 ఏళ్ల నుండి రహదారి సౌకర్యం లేక నిత్యం గిరిజనులు ఇబ్బందులు పడేవారని తన దృష్టికి తీసుకురావడంతో రెండేళ్ల పాటు జిల్లా నాయకులతోనూ, అటవీ అధికారులతో పోరాడి దబ్బగుంట నుంచి పల్లపు దుంగాడ వరకు రహదారి సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్నం భోజనాన్ని చేశారు. అనంతరం దారపర్తి సర్పంచ్ సన్యాసిరావు, ఉప సర్పంచ్ రాజేశ్వరి, మాజీ సర్పంచ్ ఎర్రయ్య ఆధ్వర్యంలో గిరిజనులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పంచాయతీలో గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం వల్ల రూ. 20 లక్షలు మంజూరయ్యాయన్నారు. మరో రూ 45 లక్షలు మంజూరు చేస్తామని వాటితో దారపర్తి పంచాయతీ పరిధిలోగల 12 గ్రామాలకు

పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ఇంటింటికి మంచినీటి కొళాయి సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. పోర్లు, గూనపాడు, కురిడి దారపర్తి గ్రామాలకు రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు వేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆయన ఆదేశించారు. పల్లపు దుంగాడలో మినీ అంగన్వాడి సెంటర్ కావాలని గిరిజనులు కోరడంతో అందుకు ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు ఎమ్మెల్యేను దుస్సాలువతో సత్కరించి అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ శేషుబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇఇ సత్యకిషోర్, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, పోతనపల్లి సర్పంచ్ వెంకట్రావు, వీరనారాయణం సర్పంచ్ ముమ్ములూరి సోంబాబు, పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ బాధ్యతగా వ్యవహరించాలి

ప్రజాశక్తి- రామభద్రపురం

గణేష్ నవరాత్రి పర్వదిన వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న మండపాల్లో ఉత్సవ కమిటీ బాధ్యతగా వ్యవహరించి నిమజ్జనం వరకు అన్ని కార్యక్రమాలు అపశృతులకు తావు లేకుండా ఉండేలా చూసుకోవాలని బొబ్బిలి రూరల్ సిఐ తిరుమలరావు సూచించారు. మంగళవారం ఎస్ఐ సురేంద్ర నాయుడుతో కలిసి మండల కేంద్రం, వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ అనుమతులు తీసుకొని నిర్వహిస్తున్న మండపాల్లో ఎటువంటి అపశ్రుతులు జరగకుండా శాంతియుత వాతావరణంలో పండగ జరుపుకోవాలన్నారు. కమిటీ అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి

బొబ్బిలి: అడ్డగోలుగా చేసిన గ్రామ కంఠం రిజిస్ట్రేషన్ రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సోరు సాంబయ్య డిమాండ్ చేశారు. బొబ్బిలి-పార్వతీపురం రహదారికి రెండు వందల మీటర్ల దూరంలో ఉన్న సుమారు ఎకరా గ్రామ కంఠం భూమిను సర్వే ఎం సర్టిఫికేట్ తో అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. గ్రామ కంఠం, ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు అక్రమార్కు లతో కుమ్మక్కై స్వాహా చేసి అమ్ముకుంటున్నారని విమర్శించారు. సర్వే నెంబర్ 265/2లో గ్రామ కంఠం భూమికి సర్వే నెంబర్ తీసుకుని విజయనగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సిద్దా రంగారావుకు పిత్రార్జితంగా వచ్చినట్లు తప్పుడు సర్వే సర్టిఫికేట్‌తో పాత బొబ్బిలికి చెందిన దిండి రోజా, దిండి రాజేశ్వరి, బి.కనకంకు రిజిస్ట్రేషన్ చేసి వెనువెంటనే పట్టణానికి చెందిన ఒక ప్రముఖ వ్యక్తికి అమ్మివేసి బొబ్బిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారన్నారు. అడ్డగోలుగా గ్రామ కంఠం భూమిని కాజేసి అమ్మేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, రిజిస్ట్రే షన్ రద్దు చేసి ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకోకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

రికార్డులను పరిశీలిస్తున్న పద్మజ

బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించేందుకు సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుండి చేపట్టనున్న ఉత్తరాంధ్ర బైక్ ర్యాలీను జయప్రదం చేయాలని సిఐటియు నగర కార్యదర్శి బి. రమణ కోరారు. బైక్ ర్యాలీ బుధవారం సాయంత్రం 5 గంటలకు విజయనగరం వస్తున్న సందర్భంగా మంగళవారం ఏపి బెవరేజస్‌లో గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం వై జంక్షన్ వద్ద బైక్ ర్యాలీకు స్వాగతం పలికి ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహం జంక్షన్‌కు చేరుకుని సభ నిర్వహిస్తామని చెప్పారు. బైక్ ర్యాలీను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఎపి బెవరేజేస్ నాయకులు శ్రీను, సిఐటియు నగర కమిటీ సభ్యులు కంది త్రినాథ్ పాల్గొన్నారు.

కొత్తవలస: విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించేందుకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు ఆధ్వర్యంలో గోడ పత్రికలను మంగళవారం కొత్తవలసలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. 32మంది ప్రాణ త్యాగాలు, వీరోచిత పోరాటంతో

కొత్తవలస: పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సాధించుకున్న ఉక్కు పరిశ్రమను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రంలో బీజేపీ కుట్ర పన్నుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస ముఠా కార్మికులు పాల్గొన్నారు.

డెంకాడ: ఉక్కు పరిరక్షణ కోసం చేస్తున్న బైక్ ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బచ్చల సూర్యనారాయణ కోరారు. భోగాపురం మండల కేంద్రదలో మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం విజయనగరంలో జరగనున్న బైక్ ర్యాలీ, బహిరంగ సభను పెద్ద ఎత్తున కార్మికులు, కూలీలు పాల్గొవాలని కోరారు.

నేరాలు ఘోరాలు

పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - గంట్యాడ

మండలంలోని పెదమజ్జిపాలెం గ్రామానికి చెందిన పైల అంజలి (26) అనే వివాహిత మంగళవారం పాముకాటుతో మృతి చెందింది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం.. పెరట్లో కరివేపాకు కోసుకుంటున్న తరుణంలో పాము కరిచింది. దగ్గర్లో ఉన్న పిహెచ్‌సికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడి నుంచి విజయనగరం కేంద్రాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలున్నారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని గొల్లాది గ్రామానికి చెందిన రేగు సోములు(50) మనస్తాపంతో గడ్డిమందు తాగి మృతి చెందాడు. తాగుడు వ్యసనం వల్ల తన భార్య పద్మ చిన్న కూతురు ఇంటికి చిలకలూరిపేట వెళ్ళిపోయింది. ఎన్నిసార్లు పిలిచినా రాలేదని మనస్థాపంతో సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యం చేసుకోగా బంధువులు బాడంగి గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదచం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ జయంతి కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

గురుకులం పరిశీలన

ప్రజాశక్తి- వేపాడ

స్థానిక గురుకుల పాఠశాలను జిల్లా సమన్వయకర్త టి.పద్మజ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పది, ఇంటర్మీడియట్ విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. విద్యార్థుల అందించే భోజన పథకాన్ని తనికీ చేశారు. విద్యార్థులతో పాటు సహ పంక్తి భోజనాలు చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్‌లో ఉన్న ఆహార దినుసులను పరిశీలించి నాణ్యతను తనిఖీ చేశారు. సిబ్బందితో అకడెమిక్ మీటింగ్ కండక్ట చేసి ఈ సారి పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో శత శాతం సాధించాలని కోరారు. పాఠశాలల్లో ఉన్న హాస్టల్, అకడెమిక్ రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట ప్రిన్సిపల్ టిఎం ఫ్లోరెన్స్, వైస్ ప్రిన్సిపల్ ఉషారాణి, ఉన్నారు.